

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థినికి రజతం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: 58కేజీల విభాగం వెయిట్ లిఫ్టింగ్లో గిరి విద్యార్థిని గొల్లోరి లెనిన్ ప్రియ రజతం సాధించింది. పోతంగి పంచాయతీ బోడిగుడ గ్రామానికి చెందిన విద్యార్థిని కడప జిల్లా పుట్టంపల్లిలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి విద్య నభ్యసిస్తోంది. కేరళ రాష్ట్రం త్రిసూర్లో జరిగిన అస్మిత ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలో 58 కేజీల విభాగంలో రజతం సాధించింది. విద్యార్థిని ప్రతిభ పట్ల కుటుంబీకులు, గ్రామస్థులు అభినందించారు.



మెడల్ సాధించిన లెనిన్ ప్రియ

అరకు కాఫీ స్థిరమైన ధరకు ప్రణాళికలు

- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో స్థిరమైన ధర, అత్యుత్తమ గుర్తింపు లభించేలా జిల్లా యంత్రాంగం పటిష్టమైన ప్రణాళికలు రూపొందిస్తోందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. కాఫీ రైతులు, వ్యాపారులు, ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలతో సోమవారం నిర్వహించిన అవగాహన, చర్చా కార్యక్రమంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కాఫీ ట్రేడర్స్ అందరూ కలిసి అసోసియేషన్ ఏర్పాటు చేసుకుంటే, చట్టబద్ధత కల్పించి, దాని ద్వారానే వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని కలెక్టర్ ప్రకటించారు. ఈ అసోసియేషన్ ద్వారా నాణ్యమైన పంటకు స్థిరమైన ధర లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ కాఫీ పంటను మధ్య దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకోవడానికి జిల్లాలో కాఫీ రైతు బజార్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. కాఫీ రైతులు ముందుకు వస్తే, యూనిట్ వ్యయంలో 30శాతం రాయితీతో యంత్ర పరికరాలను అందజేయడం జరుగుతుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.వ్యాపారం చేసే ప్రతి ఒక్క ట్రేడర్ తప్పనిసరిగా కాఫీ ట్రేడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అరకు కాఫీ నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన పార్చ్‌మెంట్ అందించాలని, పండ్ల సేకరణ నుండి తయారీ వరకు అత్యున్నత ప్రమాణాలు పాటించాలని కోరారు. అరకు, డుంబ్రిగూడ మండలాల్లో బెర్రీ బోరర్ తెగులు ఆశించినందున, పంట సేకరణ, పల్పింగ్‌లో జాగ్రత్తలు పాటించాలన్నారు. తెగులు నివారణకు సంబంధించిన వీడియోలను కాఫీ బోర్డు తరచుగా పోస్ట్ చేయాలని ఆదేశించారు. పంట అక్రమ రవాణాపై నిరంతర నిఘా కోసం చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, అగ్రికల్చర్ సిబ్బంది, ఐటీడీఏ, రెవెన్యూ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. సంతలు, కొనుగోలు కేంద్రాల్లో తూకాలలో మోసం జరగకుండా, జీసీసీ, ఐటీడీఏ సహకారంతో డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవోను ఆదేశించారు. వచ్చే సంవత్సరం జీ.మాడుగుల, జీ.కే వీధి మండలాల్లో రెండు ఏకో పల్పింగ్ యూనిట్లు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. చింతపల్లిలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, దీని ద్వారా ఎఫ్‌పీఓలు, ఆసక్తిగల ఎంటర్‌ప్రైజెస్ లబ్ది పొందుతారని కలెక్టర్ తెలియజేశారు. ఐటీడీఏ పీవో తిరుమాన శ్రీపూజ మాట్లాడుతూ జీసీసీ ద్వారా కాఫీ పండ్ల సేకరణ జరుగుతుందని, రైతులు కొనుగోలు కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, కాఫీ బోర్డు శాస్త్రవేత్తలు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అడ్మిషన్ ఫీజులు రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



ర్యాలీ చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు:ఏజెన్సీలోని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ చదువుతున్న గిరిజన విద్యార్థుల అడ్మిషన్ ప్రమోట్ ఫీజులను వెంటనే రద్దు చేయాలని, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని కళాశాలల నుంచి తరలి వచ్చిన విద్యార్థులు పాడేరులో ర్యాలీ నిర్వహించి ఐటిడిఏకు చేరుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా 2వ మహాసభను పురస్కరించుకొని ఈ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా 2వ మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు రామోహన్‌రావు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో తరుచుగా గిరిజన విద్యార్థుల మరణాలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు ప్రభుత్వం తీసుకునే చర్యలు శూన్యమన్నారు. ఎందుకు చనిపోతున్నారో కూడా తెలియని స్థితిలో ఉన్నారని, వాస్తవాలను వెలుగులోకి తీసుకు రావడానికి గిరిజన విద్యార్థుల మృతిపై జ్యూడిషల్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యాసంస్థలో హెల్త్ అసిస్టెంట్ ను నియమించాలని ఆయన కోరారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతాలలో ఉన్నత విద్య సంస్థలు లేకపోవడంతో విద్యకు దూరం అవుతున్నారని, విద్య హబ్ గా ఏజెన్సీ ప్రాంతాన్ని మారుస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు.. పాడేరు ప్రభుత్వ మెడికల్ కాలెజీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో 50 సీట్లు కోల్పోయినట్లు విమర్శించారు.

ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస మాట్లాడుతూ, ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లాంఘనపై విద్యార్థులు ప్రశ్నించాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో గిరిజనుల సమస్యలు, విద్యా హక్కులు, ఉద్యోగ అవకాశాలపై చర్చ జరిపారు. 10 డిమాండ్లపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు కొర్ర కార్తీక్, జిల్లా కార్యదర్శి జీవన్ కుమాం, ప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రి మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి -పాడేరు:ఆదివాసీ ఆత్మబంధువు డాక్టర్ విఎన్ఏకె శాస్త్రి సోమవారం మృతి చెందడం పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరిచింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస మాట్లాడుతూ, శాస్త్రి మరణం ఆదివాసీ ఉద్యమానికి తీవ్రమైన లోటు అని అన్నారు. గిరిజన సమస్యలపై 10 రకాల పుస్తకాలు శాస్త్రి ప్రచురించారని తెలిపారు. 100 రకాల వ్యాసాలు రాశారని. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గిరిజన పరిశోధనా సంస్థలో డైరెక్టర్గానూ, ఏటూరి నాగారం ప్రాజెక్టు అధికారిగా అనేక బాధ్యతల్లో పనిచేసి గిరిజన ప్రజలకు సేవ చేశారని తెలిపారు. ఆయన మరణించే వరకు గిరిజనుల కోసం గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు, విద్య, వైద్యం, తదితర సమస్యలపై అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి మరణం ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆదివాసులకు నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పనకు కృషి చేశారన్నారు. సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత కూడా నూరు శాతం రిజర్వేషన్ పునరుద్ధరణకు చట్టబద్ధత అంశాలపై గిరిజన ఉద్యమానికి సలహా సూచనలు ఇచ్చారన్నారు.


నివాళి అర్పిస్తున్న అప్పలనర్స, తదితరులు

కరుణకుమారికి ఘన సత్కారం


కరుణకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : ప్రపంచ అంధ మహిళల క్రికెట్ టి20 కప్ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన మన్యం బిడ్డ పాంగి కరుణకుమారిని సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సత్కరించి అల్లూరి సీతారామరాజు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి జిల్లా వంట్లమామిడి గ్రామానికి చెందిన పీవిటీజి కుటుంబంలో పుట్టి అంతర్జాతీయ స్థాయిలో రాణించి కప్పు గెలిచేందుకు కీలక పాత్ర పోషించడం నిజంగా చాలా ఆనందకరమైన విషయమన్నారు. ఈ గెలుపు అల్లూరి జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. కరుణ కుమారి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి లేఖ పంపించామని తెలియజేశారు. పిఎం జన్మన్ పథకం కింద ఇల్లు మంజూరు చేస్తామని, ఆమె చదువుకునేందుకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కే.ప్రసాద్, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వణికిస్తున్న చలి

- అరకు వ్యాలీలో 3.6 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటతో మన్యం వాసులు చలికి వణికిపోతున్నారు. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కమ్మేస్తుండడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి చలి గాలులు వీస్తుండడంతో మన్యం వాసులు గజగజలాడు తున్నారు. రాత్రి వేళల్లోనూ పొగమంచు దట్టంగా కురుస్తోంది. సోమవారం అరకు వ్యాలీలో 3.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, డుంబ్రిగూడ, జి.మాడుగులలో 3.9, హుకుంపేటలో 4.6, ముంచింగిపుట్టు, పాడేరులో 4.8, పెదబయలులో 6.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



బస్ స్టేషన్ వద్ద పొగమంచు



పోటీలను ప్రారంభిస్తున్న సిపిఎం సర్పంచ్ సునీత

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గంగమ్మ తల్లి గ్రామ దేవత పండగను పురస్కరించుకొని గసబ పంచాయతీ మొర్రిగూడ గ్రామంలో వాలీబాల్ పోటీలను ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, ఈ పోటీల్లో గసబ పంచాయతీ పరిధిలోని క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చక్కగా ప్రదర్శించడం జరిగిందని చెప్పారు. ఈ పోటీలో గెలిచిన వారికి మంగళవారం బహుమతి ఇవ్వడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో గసబ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, వార్డ్ మెంబర్స్ పి.సత్యనారాయణ, రాజ్ కుమార్, ఆనందరావు, పీసా అధ్యక్ష, కార్యదర్శులు బాస్కరరావు, రామేజీరావు, శివ, సోమేశ్, మొర్రిగూడ పాఠశాల చైర్మన్ రంజీత్ కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల

సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డికి ఆదివాసీ జెఎసి నాయకుల వినతి

ప్రజాశక్తి - దేవీపట్నం : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డికి ఆదివాసి జెఎసి నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసి జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర మాట్లాడుతూ రంపచోడవరం పిఎంఆర్సి నందు పోలవరం నిర్వాసితుల సమస్యలపై భూమికి భూమి నష్టపరహారం,18 సంవత్సరాల ప్యాకేజీ, చెట్లకు నష్టపరిహారం చెల్లించాలని వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈ విషయంపై ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి స్పందిస్తూ త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి దేవీపట్నం మండలంలోనే పోలవరం నిర్వాసితుల సమస్యలపై డెస్క్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే ఆదివాసీలు ఎదుర్కొంటున్న 19 రకాల సమస్యలపై వినతి పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర,మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, సోదే బాపిరాజు, కుండ్ల సాయిరామ్ రెడ్డి, నడిపూడి గాంధీరెడ్డి, కుండ్ల కృష్ణారెడ్డి, చెదల పార్వతి, వల్ల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బొజ్జిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు

రేఖపల్లి గ్రామాన్ని ముంపు పరిధిలో చేర్చాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: పోలవరం ప్రాజెక్టునకు సంబంధించి రేఖపల్లి గ్రామాన్ని ముంపు పరిధిలో చేర్చాలని కోరుతూ గ్రామ ప్రతినిధుల బృందం ధవలేశ్వరం పోలవరం అడ్మినిస్ట్రేషన్ అధికారి అభిషేక్‌ని కలిశారు. గ్రామ ప్రజల సమస్యలను, ముంపు ప్రభావాన్ని, పునరావాస ప్రయోజనాల అవసరాన్ని వివరించారు. అభిషేక్ సానుకూలంగా స్పందించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్ రేఖపల్లి అఖిలపక్షం నాయకులు, సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు పంకు సత్తిబాబు వైసిపి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు. చిక్కాల బాలు, సీనియర్ వైసిపి నేత మాచర్ల గంగలు, చీమల కాంతారావు పాల్గొన్నారు.


అడ్మినిస్ట్రేషన్ అధికారి అభిషేక్‌కు వినతి ఇస్తున్న గ్రామస్తులు


హాజరు రిజిస్టర్ తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు

హౌసింగ్ సర్వే పక్కాగా చేపట్టాలి

ప్రజాశక్తి -కొయ్యూరు : హౌసింగ్ సర్వే పక్కాగా చేపట్టాలని కొయ్యూరు డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం రేవళ్ల, కొయ్యూరు గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయా సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. మూమెంట్ రిజిస్టర్, హాజరుపట్టి తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ అభివ ద్ధి అధికారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబు

ప్రజాశక్తి - కొయ్యూరు: గిరిజన ప్రాంతాల్లో అర్హత ఉన్న వితంతువులు, 50 ఏళ్లు నిండిన గిరిజనులు, వికలాంగులు లబ్ధిదారులు పింఛన్ కోసం నెలలుగా ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం కేవలం స్పౌజ్ పెన్షన్‌కు మాత్రమే అవకాశం ఇవ్వడం అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు అన్నారు. భర్త మృతి చెంది ఇద్దరు, ముగ్గురు చిన్న పిల్లలతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వితంతువులకు పింఛన్ పెద్ద సహాయం అవుతుందని, 50 ఏళ్లు నిండిన గిరిజనులు కూడా పింఛన్ కోసం వేచిచూస్తున్నప్పటికీ, కొత్త దరఖాస్తులు స్వీకరించేందుకు గ్రామ సచివాలయాల్లో పింఛన్ సైట్ ఇప్పటికీ ఓపెన్ చేయకపోవడం బాధాకరమన్నారు. గిరిజన ప్రాంతాల వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వెబ్‌సైట్ తక్షణమే ఓపెన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు. అర్హులందరికీ పెన్షన్లు అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చివరి తేదీ 31

ప్రజాశక్తి- వి.ఆర్.పురం: ఎస్ఎస్‌సి, జిడి కానిస్టేబుల్ ఉద్యోగ అవకాశాల కోసం 25, 487 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేశారని సోమవారం ఎస్సై సంతోష్‌కుమార్ నిరుద్యోగ యువతకు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకూ దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులకు నోటిఫికేషన్‌కు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే వి ఆర్ పురం పోలీస్‌స్టేషన్‌కు వస్తే సందేహాలు తీర్చి అభ్యర్థులకు తగిన విధంగా గైడ్ చేస్తానని ఆయన తెలిపారు.

ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

ప్రజాశక్తి -సీలేరు: మావోయిస్టులు డిసెంబర్ 2 నుంచి 8 వరకు తలపెట్టిన వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముందస్తుగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఇంటెలిజెన్స్ వర్గాల ముందస్తు హెచ్చరికతో పోలీసులు ఆపరేషన్ ముమ్మరం చేశారు. వారోత్సవాలు నేపథ్యంలో ఎఒబి సరిహద్దుల్లో పోలీసులు అధిక సంఖ్యలో మొహరించడంతో గిరిజనులు భయాందోళన చెందారు. వారోత్సవాలు సోమవారం చివరి రోజు కావడంతో జికె వీధి మండలం సీలేరు ఎస్సై యాసీన్ విస్త తంగా తనిఖీ నిర్వహించారు. సిఆర్‌పిఎఫ్ పోలీసులు పర్యవేక్షించారు.

నైట్ బస్ సర్వీసులు పునరుద్ధరణ

విశాఖపట్నం డిపోకు చెందిన విశాఖ వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్‌సర్వీస్ సీలేరు నైట్‌హాల్ట్ బస్ సర్వీసులు మంగళవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు డిపో మేనేజర్ మాధురి వెల్లడించారు.

21న అమరవీరుల సంస్మరణ సభకు తరలిరండి

ప్రజాశక్తి-కూనవరం: చింతూరులో ఈ నెల 21న జరిగే అమర వీరుల సంస్మరణ సభకు భారీగా తరలి రావాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గండికొత్తగూడెంలో వుయికా కన్నయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెల్లం తమ్మయ్య మాట్లాడుతూ చింతూరులో నిర్వహించనున్న అమరవీరుల సంస్మరణ సభకు గ్రామం నుండి అందరూ తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు, మడకం నాగమణి, బాబు బొర్రయ్య, పోడియం రామారావు, శాఖ కార్యదర్శి తొండ లక్ష్మణ్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - వై.రామవరం: జిఎస్ఎల్ హాస్పిటల్ రాజమండ్రి, ఎన్టీఆర్ మెమోరియల్ టెస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించారు. గిరిజనులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎన్టీఆర్ టెస్ట్ మేనేజర్ శ్రీకాంత్, టిడిపి నాయకులు, పల్లాల వెంకటరమణరెడ్డి, మండల అధ్యక్షులు కాంతారెడ్డి, కుప్ప శీను, గొర్లె సాంబమూర్తి పాల్గొన్నారు

100 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిధి 3 మండలాల్లో 100 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ మొక్కలను శతశాతం రాయితీతో రైతులకు అందిస్తోందని, అంతర పంటల నిర్వహణకు సంవత్సరానికి రూ.5250 చొప్పున 4 సంవత్సరాల పాటు హెక్టార్‌కు రూ.21 వేలు రాయితీ అందిస్తోందన్నారు. బిందు సేద్యం నీటి వసతి పరికరాలపై కూడా ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. నీటి వసతి కలిగి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తులను తమ గ్రామాల్లోని రైతుసేవ కేంద్రాల్లో అందజేయాలని కలెక్టర్ కోరారు.

శిథిలావస్థలో గుమ్మిరేవుల పాఠశాల


శిథిలావస్థలో గుమ్మిరేవుల యుపిఎంపి పాఠశాల

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ గుమ్మిరేవుల యుపిఎంపి పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరకుంది. నూతనంగా పాఠశాల భవనం నిర్మించే విధంగా కలెక్టర్ దినేష్‌కుమార్, పిఒ చర్యలు చేపట్టాలని సర్పంచ్ మరళి, కమలమ్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్నా భవనం నిర్మాణానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో అయితే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతమన్నారు. ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందో అని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో మా పిల్లలు విద్యాభ్యాసం పొందడమే మేము చేసుకున్న పాపమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాల తరబడి నిర్మించిన పాత భవనం శిథిలావస్థకు చేరుకొని అధ్వాన స్థితిలో ఉందన్నారు. ప్రస్తుతం స్కూల్ భవనాలు లేక పంచాయతీ కార్యాలయంలో తరగతులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. కొత్త ఉపాధ్యాయులు కొలువు తీరారు. అయితే మరి పాఠశాల భవనాలు, మౌలిక వసతులు కల్పించడంపై అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని సర్పంచ్ కమలమ్మ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పంచాయతీ కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

అప్పలస్వామికి ఘన నివాళి

కుటుంబ సభ్యులను పరామర్శించిన సివేరి అబ్రహం



అప్పలస్వామికి నివాళులర్పిస్తున్న అబ్రహం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని రంగశీల పంచాయతీ సిమిలిగూడ గ్రామంలో టిడిపి పార్టీ కార్యకర్త, శీధీశేషులు చోపి అప్పలస్వామికి మాజీ ఎస్టీ సెల్ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన అప్పలస్వామి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి పార్టీ కార్యకర్తగా అప్పలస్వామి ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. కష్టసుఖాల్లో అందరికీ తోడుగా నిలిచి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారన్నారు. అలాంటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, సర్పంచ్‌లు వెంకటరమణ రాజు, తామర్ల సత్యనారాయణ, పెదబయలు వైస్ ఎంపీపీ పాంగి సోనే,టిడిపి నాయకులు సిరగం రామారావు, పొల్లాసింగి కమేష్, సోమెలి లక్ష్మయ్య అశోక్, బాబూరావు, రాజారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలు ప్రారంభం



వేంగడలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభిస్తున్న శ్యాంసుందర్, కొండలరావు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలానికి మారుమూల వేంగడ పంచాయతీ కేంద్రంలో సోమవారం ఎట్టకేలకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభం అయ్యాయి. సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి .కొండలరావు కృషి మేరకు పంచాయతీ కేంద్రం వద్ద కంప్యూటర్ ఏర్పాటు చేసి సేవలను సచివాలయం సెక్రటరీ శ్యాంసుందర్, మాజీ సర్పంచ్ కొండలరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ మేరకు కొండలరావు మాట్లాడుతూ, వేంగడ పంచాయతీలో 16 గ్రామాలు ఉండగా 2500 మంది జనాభా ఉండగా, ఆధార్ సేవలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 18 కిలోమీటర్లు దూరం పినకోటలో ఉన్న సచివాలయంలో వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తమ పంచాయతీ కేంద్రంలోనే ఆన్లైన్ సేవలు ఏర్పాటు చేయాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దిసరి. గంగరాజుకు లిఖితపూర్వకంగా విన్నవించడంతో అధికారులు స్పందించి వేంగడ పంచాయతీ కేంద్రంలోనే ఆన్లైన్ సేవలు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. పంచాయతీ ప్రజలు ఈ సేవలను సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. పంచాయతీ ప్రజలు జడ్పిటిసి గంగరాజు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సింహాద్రి, పేసా కార్యదర్శి మజ్జి .రామన్న, మాదిల రాము, పాంగి. రాజారావు, సచివాలయం సిబ్బంది శరత్ పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలి





ముంచంగిపుట్టు, చింతపల్లిలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్, కార్మికులు, నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మండల కేంద్రంలోనీ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపం వద్ద సోమవారం సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్‌రావు ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతన రూ.26000 వేలు, స్కిమ్ వర్కర్లను కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలని, అసంఘటీత రంగం కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి, కనీస పెన్షన్ నెలకు రూ.9000 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్మిక సంఘం నాయకులు లైకోన్, అంగనవాడి యూనియన్ కార్యదర్శి ఎస్ ఈశ్వరి, అధ్యక్షులు గంగ భవాని, ఆర్.విజయ, దేవి, సుబ్బలక్ష్మి, వి కౌసల్య, ఎస్ చిట్టిబాబు పాల్గొన్నారు.

చింతపల్లి : సిఐటియు 18వ అఖిలభారత మహాసభల వాల్ పోస్టర్‌ను సోమవారం చింతపల్లి పాత బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా శానిటేషన్ కార్మికులు, ఆటో కార్మికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంపదను బహుళజాతి సంస్థలకు దోచిపెడుతున్నాయని విమర్శించారు. మోడీ ప్రభుత్వం బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, ఉక్కు కర్మాగారాలు, ఆయిల్ కంపెనీలు, విమానాశ్రయాలు, పోర్టులు, ఎయిర్ ఇండియా వంటి జాతీయ ఆస్తులను అంబానీ, ఆదాని, టాటా కంపెనీలకు కారుచౌకగా ధారాదత్తం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడం వల్ల రాబోయే తరాలు ఉద్యోగావకాశాలు నష్టపోతారని, రిజర్వేషన్లు కూడా లేకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని, దీంతో సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, జీతభత్యాలు కోరే హక్కులు కోల్పోయే పరిస్థితి వచ్చిందన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31 నుండి జనవరి 4 వరకు విశాఖలో జరుగు సిఐటియు 18వ అఖిలభారత మహాసభల్లో వీటిపై చర్చించి పోరాటాలకు కార్యాచరణ రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. మహాసభల్లో భాగంగా జనవరి 4న విశాఖ ఆర్కే బీచ్‌లో లక్షలాది మంది కార్మికులతో జరుగు బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి శానిటేషన్ కార్మికులు ఈశ్వరరావు, రాములమ్మ, చంటిబాబు, ఆటో యూనియన్ ప్రతినిధులు సంపరి రమణ, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై వినతి



వినతిపత్రం ఇప్పిస్తున్న జిలా సిఐటియు నేత సన్నిబాబు

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్ల, మినీ వర్కర్లు, ఆయాల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి సోమవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీలు అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, 42 రోజుల అంగన్వాడీల చారిత్రాత్మకమ సమ్మె సందర్భంగా 2024 జూలైలో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ ఇచ్చారని, వాటిని అమలు చేయాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ మినహాయింపు ఇచ్చి మెయిన్ సెంటర్లగా మార్చాలని, హెల్పర్ ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సెంటర్ నిర్వహణకు 5+ ఫోన్లు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, గ్రాడ్యుటి అమలుకు గైడ్లైన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈనెల12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద ధర్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు టి రాజమ్మ, జీ.మాదమ్మ సిహెచ్ కొండమ్మ సిహెచ్ పార్వతమ్మ, చిన్నమ్మి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు, గ్రామస్తులు

ప్రజాశక్తి-కాశీపట్నం: అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ నక్కులమామిడి గ్రామస్తులు రోడ్డు పనులు పూర్తి చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు పాంగి రాజారావు, స్థానిక టీడీపీ పంచాయతీ అధ్యక్షులు నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అనంతగిరి మండలం మారుమూల కివర్ల పంచాయతీకి చెందిన నక్కులమామిడి గ్రామంలో పివిటిజి తెగకు చెందిన 60 కుటుంబాలు వ్యవసాయం, అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. గ్రామానికి రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. హాస్పిటల్, నిత్యావసర సరుకులకు ఐదు కిలోమీటర్లు కాలినడకన నడిచి వెళ్లడం తప్పడం లేదన్నారు. డోలి శరణ్యంగా మారిందని వాపోయారు.గతంలో కొంత దూరం రోడ్డు వేసిన గుత్తెదారుడు మిగిలిన మూడు కిలోమీటర్ల రోడ్డు వేయకుండా పనులు అర్ధంతరంగా నిలిపివేశారన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు.

నవోదయ మోడల్ టెస్టు నిర్వహణ



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-చింతపల్లి : స్థానిక యన్ఆర్ టెక్‌హబ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్, కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నవోదయ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సోమవారం మోడల్ టెస్ట్ నిర్వహించారు. పరీక్ష విధానంపై అవగాహన కల్పించి, విద్యార్థుల్లోని పరీక్ష భయాన్ని తొలగించి, మెరుగైన రీతిలో పరీక్ష రాయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు, మన్యం కవి నూనే రమేష్ తెలిపారు. ఈ మోడల్ టెస్ట్‌కు చింతపల్లి మండలంతో పాటు సమీప మండలాల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభ చూపారు. పరీక్ష అనంతరం 'పరీక్షలో విజయం సాధించడం ఎలా?' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శెట్టి స్వామి, శెట్టి చంద్రశేఖర్, వంజరి మేరీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో బేబీ మదర్ ఫౌంటెయిన్



ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి ఆధ్వర్యంలో బేబీ మదర్ శిల్పం, దాని చుట్టూ రంగురంగుల విద్యుత్, నీటితో ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. ఇది కొత్త అందాన్ని తెచ్చింది. సాయంత్రం రంగులు మారే నీటి ప్రవాహం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ ప్రాజెక్టు ఈనెల 14న దీనిని ప్రారంభించ నున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

- జిల్లా ఖజానా అధికారి ప్రసాద్ బాబు

ప్రజాశక్తి-పాడేరు:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షను దారులు తమ జీవన ప్రమాణ ధృవపత్రాలు (లైఫ్ సర్టిఫికెట్)ను 2026 జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు తప్ప నిసరిగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి ఆర్ ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ దారులు కొత్త సంవత్సరానికి సంబంధించిన తాజా ధృవపత్రాలను నిర్దిష్ట గడువులోపే సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. జీవన ప్రమాణ ధృవపత్రాల్ని కార్యాలయాలు, మీసేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు లేదా జీవన ప్రమాణ యాప్ ద్వారా కూడా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ధృవీకరణ ప్రక్రియలో ఆధార్ కార్డు, పెన్షన్ ఐడి లేదా పిపిఓ సంఖ్య, ఓటిపి కోసం మొబైల్ నెంబర్, బ్యాంక్ పాస్ పుస్తకం తమ దగ్గర ఉండాలని తెలిపారు. పెన్షనర్ల సౌకర్యం కోసం అన్ని ఖజానా కార్యాలయాలలో అవసరమైన ఏర్పాట్లను చేస్తునట్లు తెలిపారు. పెన్షను దారులు ఎవరైనా విదేశాలలో ఉంటే వారు తమ రాయబారి చేత తమ జీవన ప్రమాణ ధృవపత్రాలు సమర్పించాని, ఎవరైనా అనారోగ్యంతో ఖజానా కార్యాలయంకు హాజరు కానీ పక్షములో సిబ్బందిని సంప్రదించ గలరని సూచించారు. ఎ.టి.ఓ చింటూరు ఫోన్: (994865878) ఎ.టి.ఓ రంపచోడవరం(9182 935313) ఎస్.టి.ఓ అడ్డతీగల (8074239606) ఎటిఓ పాడేరు (9440974236) ఎస్టిఓ చింతపల్లి (9440307050) ఎస్టిఓ అరకు(9652372507) నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



కేక్ కట్ చేసిన ఫాస్టర్ మోజెస్

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని పటిమమిడి గ్రామంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సభ అధ్యక్షులు పాస్టర్ వి.మోజెస్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి ప్రత్యేకంగా గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా అప్ హెూల్డ్ స్వఛధ సేవ సంస్థ ఫౌండర్ అంజూరి. పిలిప్ తిమోతి, హౌస్ అఫ్ హెూఫ్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ డైరెక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం తిమోతి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జరుపుకునే క్రిస్మస్ పండుగకు ఎంతో మహత్తరమైన ఆధ్యాత్మిక అర్థం ఉందన్నారు. యుసివైఎ వ్యవస్థాపకులు రీమాలి జాన్ మాట్లాడుతూ, సమాజంలో బలహీన వర్గాలను ఆదుకోవడం, ఒకరిని మరొకరు గౌరవించడం, ఏకత్వంతో జీవించడం క్రీస్తు చెప్పిన నిజమైన ఆచరణ"అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు కే ప్రేమ్ కుమార్, కార్యదర్శి సుధాకర్, నియోజకవర్గం ఫెలోషిప్ కార్యదర్శులు జేమ్స్, ఫెలోషిప్ పెద్దలు యోహాను, డేవిడ్, జాన్ బాబు, డానియల్, రాజారావు పాల్గొన్నారు.

ఘనంగా 'మహాపరినిర్వాణ దివస్'

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి. ఆర్. అంబేద్కర్ 'మహాపరినిర్వాణ దివస్'ను సోమవారం వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) కె.రామారావు, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జుసుఫ్ కబీర్ అన్సారీ, ఇతర శాఖాధికారులు, సిబ్బందితో కలిసి డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్తేరు డివిజన్‌లోని ఉప-డివిజన్ కార్యాలయాలలో కూడా మహాపరినిర్వాణ దివస్‌ను పాటించారు.

బాల్యవివాహాలు అరికట్టేందుకు కృషి చేయాలి

పిసిఎంఎ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి
అధికారులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: బాల్యవివాహాలు అరికట్టేందకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ మీటింగ్‌హాల్లో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహరహిత రాష్ట్రంగా, దేశంగా చేయాలని ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తోందని నవంబర్ 27 నుండి మార్చి 8 వరకు మూడు విడతలుగా ఈ కాంపెయిన్ జరుగుతుందన్నారు. అన్ని విద్యాసంస్థలలో ప్రతిజ్ఞ చేసి క్యాంపైన్ నిర్వహించాలన్నారు. పోలీస్ అధికారులు పిసిఎంఎ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు, పంచాయతీరాజ్ సిబ్బంది స్వయం సహాయక సంఘాల్లో అవగాహన కల్పించాలన్నారు. చైల్డ్‌లైన్ అధికారులు ఎన్జీవోలు బాల్యవివాహాలు నిలుపుదల చేసి వారికి షెల్టర్ కల్పించాలన్నారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్టు మీ దృష్టికి వస్తే 1098 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇంచార్జ్ డిఆర్ఓ సత్తిబాబు, జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ,జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి రామలక్ష్మి ,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ : విశాఖ జిల్లాలో భీమిలి, పెందుర్తి, అనందపురం పద్మనాభం మండలాల్లో మేజర్, మైనర్ పంచాయతీలో గత 30 సంవత్సరాలనుండి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ, స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా గౌరవ అధ్యక్షులు పడాల రమణ కోరారు. కోవిడ్ సమయలో సైతం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సేవచేస్తే కనికరం లేని అధికారులు వారి జీతాలు కొంచెం అయినా పెంచిన దాఖాలు లేవని వాపోయారు. స్వచ్ఛభారత్ కార్మికుల కు బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వీరికి వేతనాలు 15 వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వాడుకోవాలని తర్వాత సర్దుబాటు చేస్తామని ఉత్తర్వులు జారీ చేశారు. అయినా అధికారులు అమలు చేయలేదని, జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు అడిగితే పనులు మానుకోమని బెదిరిస్తున్నా రన్నారు. గత ప్రభుత్వం రూ.6 వేల నుండి రూ.10 వేలకు జీతం పెంచుతూ, జివో 680 విడుదల చేసిందన్నారు.

అయితే ఆ జిఒ నేటివరకు అమలుకు నోచుకోలేదని, 680 జిఒను వెంటనే అమలు చేయాలన్నారు. మేజర్ పంచాయితీ లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలు అమలు చేసి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొండపు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పిల్లి వీర్రాజు, టి.పద్మనాభం, సత్యనారాయణ, చెల్లూరి కృష్ణ, అప్పారావు, అంజిబాబు, పసుపులేటి రాజు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని వ్యక్తిపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : షాపును లీజుకు తీసుకొని లీజు గడువు ముగిసినప్పటికీ ఖాళీ చేయకుండా, మరి కొంతకాలం షాపులో కొనసాగుతూ నెలనెలా చెల్లించాల్సిన అద్దె చెల్లించకుండా, ఆకస్మికంగా షాపు ఖాళీ చేసి నష్టం వాటిల్లేలా చేసిన మహమ్మద్ ఇక్బాల్‌పై తగు చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని షాపు యజమాని కిరణ్‌కుమార్ కోరారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నం ఆశీలమెట్ట ప్రాంతంలో నివసిస్తున్న తమకు, ఆశీలమెట్ట నుంచి రామాటాకీస్ వెళ్లే మార్గంలో షాపు ఉందని దీనిని 2008లో మొహమ్మద్ ఇక్బాల్ అనే వ్యక్తికి లీజుకు ఇచ్చామన్నారు. ప్రారంభంలో నెలనెలా అద్దె సక్రమంగా చెల్లించారన్నారు. లీజు గడువు ముగిసి 10 సంవత్సరాలైన తర్వాత షాపు ఖాళీ చేయమని అడిగితే ఖాళీ చేయలేదని, కొన్నాళ్ళు కొనసాగుతానని చెప్పడంతో అంగీకరించామన్నారు. సక్రమంగా అద్దె చెల్లించని కారణంగా ఖాళీ చేయమని చెప్పడం జరిగిందన్నారు. అయితే తనకు రూ.20 లక్షలు గుడ్‌విల్ ఇస్తే ఖాళీ చేస్తానని చెప్పాడని, అందుకు తాము అంగీకరించలేదన్నారు. ఈ నేపథ్యంలో తమకు చెప్పకుండానే గత నెలలో షాపు ఖాళీ చేసి వెళ్ళిపోయాడన్నారు. ఆగస్టు నుంచి అద్దె బకాయి ఉందన్నారు. ఇప్పటికైనా ఆయనపై చర్య తీసుకొని తమకు న్యాయం చేయాలని కిరణ్ కుమార్ కోరారు.

నేటి నుంచి విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ బాలోత్సవాన్ని ఈసారీ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విశాఖ బాలోత్సవం మూడో పిల్లల పండగ కార్యక్రమంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి స్థానిక గ్రీన్ పార్క్ హోటల్ ప్రాంతంలోని సెంట్ తెలుగు మీడియం స్కూల్ ఈ నెల 9, 10, 11 తేదీలలో వేదిక కానుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, రోటరీ జిల్లా గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ పికె.జోష్ వంటి ప్రముఖులు ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, అకడమిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో కల్చరల్ విభాగంలో 13, అకడమిక్ విభాగంలో 63 ఈవెంట్స్ ఉంటాయి. వీటిలో పాల్గొంటున్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, విజేతలకు మెమొంటోలు అందజేస్తారు. గత ఏడాది నిర్వహించిన రెండో బాలోత్సవం కార్యక్రమానికి నగర పరిధిలోని పాఠశాలల నుంచి 8000 మంది విద్యార్థులు పాల్గొనగా, ఈసారి అంతకంటే ఎక్కువ మంది వస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణలో విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, అధ్యక్షులు పి.రఘు, ఉపాధ్యక్షులు ఎంవి.జానకిరామ్, డాక్టర్ కె.రమాప్రభ తదితరులు కీలక భూమిక నిర్వహిస్తున్నారు.

21న పల్స్‌పోలియో

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 21న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమంలో 5 సంవత్సరాల్లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ కోరారు. సోమవారం కార్యాలయ సమావేశ మందిరంలో పల్స్‌పోలియోపై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ శతశాతం పోలియోచుక్కలు వేయించాలన్నారు. 1062 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 50 ట్రాన్సిట్ బూత్‌లు, 85 మొబైల్‌బూత్‌లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మిగిలి పోయిన వారందరికీ 22, 23 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియోచుక్కలు వేస్తారని, జిల్లాలో 85 హైరిస్క్ ప్రాంతాలలో 6,497 మంది చిన్నారులు ఉన్నారని అలాంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్అశోక్, ఇంచార్జ్ డిఆర్ఒ సత్తిబాబు, జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ, డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ శంకర ప్రసాద్,ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మేరీమాత ఉత్సవానికి హాజరైన జనసందోహం

ఘనంగా కొండ గుడి మేరీమాత ఉత్సవం

- పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో రోజ్ హిల్స్‌పై ఉన్న మేరీ మాత (కొండ గుడి) ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. విశాఖ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరావడంతో పాత నగరం ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్ నుంచి సెయింట్ అలోషియస్ పాఠశాల వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర భక్తులు బారులు తీరారు. పాత పోస్ట్ ఆఫీస్, అలోషియస్ పాఠశాల, కొండ గుడి రహదారి, ప్రార్థనా మందిరం, లూర్దు మాత గుహల వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. నవదిన ప్రార్థనల కోసం ప్రత్యేక షెడ్లు నిర్మించారు. మేరీమాతకు భక్తులు సమర్పించిన ఆభరణాలతో మేరీమాత దర్శన కార్యక్రమం నిర్వహించారు. మేరీ మాత చరిత్ర, కొండ గుడి ప్రార్థన మందిరం విశిష్టతలను తెలిపే పుస్తకాలు విక్రయించారు. ఈ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉత్సవం కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపారు. అమలుద్భవి మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ కొండాల జోసెఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరం బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 29 నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు 40 రోజులకుగాను జరిగిన లెక్కింపులో నగదు రూపంలో రూ.67 లక్షలా 78 వేలా 784 వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి మీడియాకు తెలిపారు. బంగారం 47 గ్రాములా 500 మిల్లీగ్రాములు, వెండి 669 గ్రాములు వచ్చిందని, అవి కాకుండా ఫారెన్ కరెన్సీ కూడా వచ్చిందని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యులు కందుల నాగరాజు, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారులు ఎన్.ఆనంద్ కుమార్, కె.రాజేంద్ర కుమార్, పర్యవేక్షకులు ఎస్.కనకరాజు, కె.పద్మజ, డి.రాజు, యుబిఐ బ్రాంచ్ మేనేజర్, పోలీసులు పాల్గొన్నారు.